క్లుప్తంగా

నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా డివిజన్లలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించేందుకు సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే స్పందన జరుగుతుందన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా తమ సమస్యలను ఆయా ప్రాంతవాసులు జోనల్ కమిషనర్ల దష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ కొత్త అమ్మవారి గుడి ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు లలితా బార్ ప్రాంతం, నగరాల కల్యాణ మండపం, విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం, సారంగం రోడ్, ఈద్గా మహల్ బూస్టర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందితో సహకరించాలని కోరారు.

వృద్ధుడిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు బైక్ పెట్టవద్దనందుకు వృద్ధుడిపై దాడి చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట సీఎస్‌ఐ చర్చి ప్రాంతానికి చెందిన కాటూరి ఇమ్మానుయేల్(60) ఒంటరిగా ఉంటాడు. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ యువకుడు ఇమ్మానుయేల్ ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేయసాగాడు. దీంతో తన ఇంటి ముందు బైక్ పెట్టవద్దని చెప్పడంతో ముఖంపై చేతితో గుద్దాడు. దీంతో కింద దవడ నుంచి తీవ్ర రక్తం రావడంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సందడిగా పాతబస్తీ రహదారులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కెనాల్ రోడ్డులో రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిశాయి. వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులన్నింటిలోనూ భారీ సంఖ్యలో తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. చెరుకు గడలు, మిఠాయి దుకాణాలు, బొమ్మల విక్రేతలు ఇలా విభిన్న వస్తువుల అమ్మకాలకు చిరు వ్యాపారులు ఆయాప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో కెనాల్‌రోడ్డు పరిసర ప్రాంతాలతో పాటుగా మొయిన్‌బజార్, బీఆర్పీ రోడ్డు, శివాలయంవీధి, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాలన్నీ సందడిగా దర్శనమిచ్చాయి. దీనికి తోడు రథోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రధానంగా చిన్నవ్యాపారులు చిన్నారులు ఆడుకునే సామాగ్రిని విక్రయిస్తూ సందడి చేశారు. అదేవిధంగా మిఠాయి, ఖర్జూర, బెల్ల పుచెరుకు, ఇతర తినుబండారాలను విక్రయించేందుకు ఆయా ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. అలాగే వన్‌టౌన్‌లోని మిఠాయి దుకాణాలు సైతం తమ ముంగిట ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా వన్‌టౌన్‌లోని పెద్ద సంస్థలు సైతం తమ దుకాణం వద్ద ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి రథోత్సవానికి వచ్చిన సందర్శకులకు మిఠాయిలను విక్రయించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 188 నెలలుగా వయోవృద్ధులకు సేవలు అందించటంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ పాత్ర అద్వితీయమని శ్రీ శంభవనాథ్ రాజేంద్రసూరి జైన్ స్వేతాంబర్ ట్రస్ట్ అధ్యక్షుడు సోలంకీ రాజేంద్రకుమార్ జైన్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత తేజ్‌రాజ్ సోలంకీ, కాంచనదేవి సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. గౌరవ అతిథి శ్రీశంభవనాథ్ జైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘం కార్యదర్శి పన్నాలాల్ డి.జైన్, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.గోపీనాథ్ మాట్లాడుతూ.. ట్రస్ట్ సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు, ట్రస్టీలు అమర ఉమామహేశ్వర రావు, ఎస్ఎన్ వరప్రసాద్, నీలీ సతీష్‌కుమార్, కె.మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.





ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈజీ భ్రమరాంబ



ఉత్సవ మూర్తులను రథం వద్దకు తీసుకువస్తున్న సిబ్బంది







రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు





వైభవంగా రథోత్సవం

వన్‌టౌన్ కెనాల్‌రోడ్డులో ఆది దంపతుల రథోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా సాగింది. దేవతా ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. వన్‌టౌన్ వీధులు భక్తజనంతో కిటకిటలాడాయి. మేళాతాళాలు, కోలాటాలు, కళాకారుల నృత్యాలతో రథం ముందుకు సాగింది. నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోరాటయోధుడు ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి



అన్నదానం ప్రారంభిస్తున్న తోలేటి శ్రీకాంత్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఛత్రపతి శివాజీ గొప్ప పోరాటయోధుడు అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శివాజీ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగా బావాజీమఠం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి పాల్గొని శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. దేశానికి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంట్‌లో విజయవాడ మరాఠీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతీయ సంస్కృతిని కాపాడటంలో శివాజీ నిర్వహించిన పాత్ర అపూర్వమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, సమాజ్ అధ్యక్షుడు బాలాజీ జాదవ్, ప్రధానకార్యదర్శి విలాస్‌పవార్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ప్రవీణ్ బోస్లే, మాజీ కార్పొరేటర్ అవాల మారుతి, బులియన్ మార్కెట్ నాయకులు కేఎస్ఆర్ నాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తేలప్రోలు రాజా హైస్కూల్ 1982-83 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తేలప్రోలు రాజా హైస్కూల్‌లో 1982–83లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం నగరంలోని ఓ హోటల్ జరిగింది. పూర్వ విద్యార్థులందరూ ఒక చోట ఆ నాటి పాఠశాలలో చోటు చేసుకున్న పలు మధురానుభూతులను పంచుకుని వేడుక జరుపుకున్నారు. చిన్న నాటి ముద్దు పేర్లతో ఒకరునొకరు పిలుచుకుంటూ 40 ఏళ్ల వెనక్కి వెళ్లారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఒక చోట చేరడంతో పండుగ వాతావరణం నెలకొంది. స్కూల్ బయట కొనకుని తిన్న చిల్లర తిండ్లు, స్కూల్ గ్రౌండ్‌లో ఆడిన ఆటలు మొదలు కొని సెలవులు, పండుగల్లో స్నేహితుల ఇళ్లకు వెళ్లి చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా, సంతోషంగా గడిపారు. క్లాస్‌మేట్స్‌తో పాటు బెంచ్‌మేట్స్‌ను పేరు పేరున పలకరిస్తూ ఆనందంగా గడిపారు. ఇలా ప్రతి సంవత్సరం స్నేహితులందరూ కలిసి ఉండాలని ఒకింత ఉద్వేగానికి లోను కావడంతో పాటు ఆత్మీయ కలయికకు గుర్తుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన తడవర్తి శ్యామ్‌ప్రసాద్, వడ్లాని జగన్‌మోహనరావు, వాంద్రసి రమేష్, ఉంగరాల సింహాచలం, ఆవాల భాస్కర్, భోగవల్లి శకుంతల, షేక్.సమీన్, జూలకంటి రవీంద్ర, పక్కి మురళీ, పోకల శ్రీనివాస్, విస్సంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళిత వాదాన్ని బలంగా వినిపించాలి



ముళ్ళచినుకులు దళిత కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రమాదేవి, మానస, తదితరులు

విజయవాడకల్చరల్: దళిత వాదాన్ని బలంగా వినిపించాలని దళితులు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని ఐద్వా నాయకురాలు రమాదేవి తెలిపారు. ఎండ్లూరి మానస, అరుణ గోగులమండ సంకలన పరచిన ముళ్ళ చినుకులు దళిత కథా సంకలనం ఆవిష్కరణ సభను శిఖామణి సెంటర్‌ని శిఖరా పాఠశాలలో సంకలనకర్తలు ఆదివారం నిర్వహించారు. కథా సంకలనాన్ని ఆవిష్కరించిన రమాదేవి మాట్లాడుతూ దళితుల పట్ల పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి పోరాటం సాగుతూనే ఉందన్నారు. పోరాటాలు విస్తృతం చేయడానికి దళిత కవులు, రచయితలు లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన అవసముందని చెప్పారు. కవి అరసవిల్లి కృష్ణ కథా సంకలనాన్ని సమీక్ష చేస్తూ కథలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయన్నారు. ఏ సాహిత్యమైనా ప్రజల నుంచి రావాలని, ప్రజల కోసమే రాయాలని సూచించారు. సంకలనంలోని రచయితలు సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక అంశాలను ప్రస్తావించారన్నారు. కథా సంకలన సంపాదకులు మానస, అరుణ మాట్లాడుతూ తమ లక్ష్యం నెరవేరిందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ రథసారథి బీఆర్ అంబేడ్కర్ అందరి వాడని ఆయన సేవలను నేటి తరం యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త బండ్ల మాధవరావు, యువ కవి అనిల్ డ్యానీ, కంచర్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాలు




కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

- శివాలయాల్లో కొనసాగిన కల్యాణ వేడుక
- కల్యాణాన్ని వీక్షించిన భక్త జనసందోహం



శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం



పాతశివాలయంలో ఉత్సవమూర్తులు



విశేష అలంకారంలో వీరభద్రస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శివాలయాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి శివయ్య కల్యాణోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ ఆయా ఆలయాల్లో పలు విశేష వైదిక కార్యక్రమాలను జరిపారు. ఆయా ఆలయాలు హర నామస్మరణతో మార్మోగాయి. స్వామి వారి ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణాలను ఆయా ఆలయాల్లో అత్యంత నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ నిర్వహించారు. వినాయక పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారంచుట్టిన అర్చకస్వాములు ఆయా ఘట్టాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అదేవిధంగా లింగోద్భవ కాలంలో స్వామి వారికి అంతరాలయంలో ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు.

విజయేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

నగరంలోని మరో పురాతన ఆలయమైన శ్రీ విజయేశ్వరస్వామి వారి దేవస్థానంలో అర్ధరాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి కల్యాణోత్సవానికి అర్చకస్వాములు శ్రీకారం చుట్టారు. గంగాపార్వతీ సమేత విజయేశ్వరస్వామి వారి మూర్తులకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం లింగోద్భవ కాలంలో స్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

నగరేశ్వరస్వామి వారి దేవస్థానం (కొత్త గుళ్ల)లో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణమందిరంలో స్వామి గంగాపార్వతీ సమేత నగరేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలను జరిపారు.

పాండురంగ సన్నిధిలో..

కొత్తపేట గణపతిరావురోడ్డులోని పాండురంగ స్వామి దేవస్థానంలో మల్లేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. శివలింగానికి విశేష అభిషేకాలను నిర్వహించారు. స్థానిక ప్రముఖులు, అధికారులు పాల్గొని అభిషేకాలను నిర్వహించారు.

ధర్వేశ్వరస్వామి సన్నిధిలో..

కొత్తపేట సైకంవారివీధిలో కొలువై ఉన్న శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణవేదికపై స్వామి వారి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు మురళీ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను చేపట్టారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయాల్లో ఒకటైన వన్‌టౌన్ బ్రాహ్మణవీధి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ పరిధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్రబెల్లం దారణ మంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి తిరుమంజనోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఆదివారం ఉదయం నిర్వహించారు. అంతరాలయంలో మూలవిరాట్‌కు జరిగే ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. మంగళ వాయిద్యాలు, హరినామస్మరణ, వేదపఠనం, వీనులవిందైన మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి తిరుమంజనం చేపట్టారు. పంచామృతాల, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో కూడిన అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

రవాణా రంగ కార్మికుల జీవనంపై కేంద్రం దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత చట్టం – 2020 తీసుకొచ్చి రవాణా రంగ కార్మికుల జీవనంపై దాడి చేసిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మోహన్ చెప్పారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఇఫ్టూ నాయకుడు కె.రవీంద్ర అధ్యక్షతన ఆదివారం ఇఫ్టూ విజయవాడ నగర 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆటో, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. దేశ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్న గౌతం అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు అన్ని రంగాలను నిబంధనలను అతిక్రమించి నరేంద్ర మోడీ ప్రభుత్వం అక్రమంగా కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎల్.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం 19 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమాపతి, వంశీ కిరణ్, సురేష్, బసవయ్య, కాశీరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.